తెలంగాణకు ఓటు మాటలు

ఎన్నికల వేళ మోదీ మాయ!

తెలంగాణ ఒత్తిడికి తలొగ్గి గిరిజన వర్సిటీ, పసుపుబోర్డు హామీ

- విభజనహామీలో ఉన్నా గిరిజన వర్సిటీపై నాన్చివేత ధోరణి
- పసుపు బోర్డుపై ఐదేండ్లుగా బీజేపీ 'బాండ్ పేపర్' డ్రామా
- ప్రకటన చేయడానికే దశాబ్దం.. అమలుకు మళ్లీ ఎన్నేండ్లో?
- సాగునీటి ప్రాజెక్టులు, రైతు పథకాలపైనా ప్రధాని పచ్చి అబద్ధాలు
- మహబూబ్‌నగర్‌లో సభపెట్టి 'పాలమూరు' ప్రాజెక్టుకు మొండిచెయ్యి

ప్రధాని మోదీకి శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాద్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం, ప్రజల ఒత్తిడికి ప్రధాని మోదీ తలొగ్గారు. ఎట్టకేలకు రాష్ట్రంలో గిరిజనవర్సిటీ, పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆదివారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించారు. తెలంగాణలో రూ.13,500 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు దేవరకద్ర నియోజకవర్గంలోని అమిస్తాపూర్ గ్రామంలో వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నారాయణపేట జిల్లాలోని జక్లేర్-కృష్ణ రైల్వే లేన్, కాచిగూడ నుంచి కృష్ణా వరకు కొత్త రైళ్లకు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం భూత్పూర్ సమీపంలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తెలంగాణలో పసుపు బోర్డు, గిరిజనవర్సిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకొన్నట్టు ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం మాత్రమే మోదీ హడావుడిగా ఈ హామీలు ఇచ్చారని స్పష్టమవుతున్నది. ఈ రెండు అంశాలు తప్ప ప్రధాని ప్రసంగం మొత్తం పచ్చి అబద్ధాలు, కుటుంబ పాలన, అవినీతి అంటూ రొడ్డకొట్టుడు వ్యాఖ్యలకే పరిమితమైంది. వాస్తవానికి రాష్ట్రంలో గిరిజన వర్సిటీని ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పొందుపరిచారు. అది తెలంగాణకు హక్కుగా రావాల్సిందే. అయినా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మోకాలడ్డింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సైతం కేంద్రానికి అనేక లేఖలు కూడా రాసింది. తనను గెలిపిస్తే వారంలోగా పసుపుబోర్డు తెస్తానని 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ బాండ్ రాసి ఇచ్చారు. ఆ తరువాత పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్నికలను దృష్టిలోపెట్టుకొనే పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీపై మోదీ ప్రకటన చేశారని భావిస్తున్నారు. బాండ్‌పై రాసిచ్చినదానిని ప్రకటించడానికే ఏండ్లకేండ్లు పడితే.. వాటిని అమలు చేయడానికి ఎంతకాలం పడుతుందోనని చర్చించుకుంటున్నారు.

పచ్చి అబద్ధాలు.. రొటీన్ మాటలు

> *తెలంగాణకు రావడం.. అబద్ధాలు ఆడి వెళ్లిపోవడం ప్రధాని మోదీకి అలవాటే. ఆదివారం కూడా అదే పునరావృతం అయ్యింది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై పచ్చి అబద్ధాలు ఆడారు. ప్రాజెక్టులతో పాలాలకు నీళ్లు పారలేదని, రైతులకు ప్రయోజనం కలుగలేదని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల రైతులకు కలిగిన ప్రయోజనాలు ప్రధానికి కనిపించకపోవడం విడ్డూరం. 'ప్రాజెక్టుల నుంచి నీళ్లు రాకపోతే.. ఒకప్పుడు కరువుకు కేరాఫ్‌గా ఉన్న తెలంగాణ జిల్లాల్లో ఇప్పుడు పచ్చదనం ఎలా పరుచుకున్నది? సాగు విస్తీర్ణం 1.3 కోట్ల ఎకరాల నుంచి 2.3 కోట్ల ఎకరాలకు ఎలా చేరింది? తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి 77 లక్షల టన్నుల నుంచి 3 కోట్ల టన్నులకు ఎలా పెరిగింది.' అని తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నది వాస్తవం కాదా? అని అడుగుతున్నారు. నడి వేసవిలోనూ నిండుకుండల్లా ఉన్న చెరువులను, గలగలా పారుతున్న కాలువలను, తొమ్మిదేండ్లలోనే ఉబికి వచ్చిన భూగర్భ జలాలను అడిగితే సాగునీటి రంగంలో తెలంగాణ ప్రగతిని వివరిస్తాయని అంటున్నారు.*

గిరిజన వర్సిటీ.. తెలంగాణపైనే కక్ష

తెలంగాణలో గిరిజన వర్సిటీ ఏర్పాటు విషయంలో కేంద్రం మొదటినుంచీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. ఏపీకి ఒక న్యాయం.. తెలంగాణకు మరో న్యాయం అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. ఏపీ పునర్విభజన చట్టం-2014 సెక్షన్ 94 షెడ్యూల్13 (3) ప్రకారం సెంట్రల్‌వర్సిటీ హోదాతో తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాల్సి ఉన్నది. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం 2019లోనే ములుగు జిల్లా కేంద్రం సమీపంలో 335 ఎకరాల స్థలాన్ని గుర్తించింది. తాత్కాలికంగా వర్సిటీని కొనసాగించేందుకు ఐటీడీఏ భవనాలను సైతం వినియోగించుకొనేందుకు అనుమతి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు సైతం ఈ స్థలాన్ని పరిశీలించి, యూనివర్సిటీ ఏర్పాటుకు అనుకూలమని తేల్చారు. అయినా కేంద్రం వర్సిటీ ఏర్పాటు అంశాన్ని పక్కనబెట్టింది. ఇదే సమయంలో ఏపీలో ఏమీ లేకున్నా గిరిజన వర్సిటీ ఏర్పాటు చేసింది. 2019లో కేంద్రం దేశవ్యాప్తంగా 16 సెంట్రల్ యూనివర్సిటీలకు అనుమతినిచ్చింది. ఇందులో ఏపీ గిరిజన వర్సిటీ కూడా ఉంది. ఆ సమయానికి ఏపీలో భూ కేటాయింపులు, భవనాలు వంటివి ఏమీ లేవు. అయినా వెంటవెంటనే ప్రకటన, వీసీ నియామకం, తాత్కాలిక భవనాల్లో తరగతుల ప్రారంభం చకచకా జరిగిపోయాయి. 12 కోర్సుల్లో సీట్లు భర్తీ చేశారు. తెలంగాణలో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేయాలని సీఎంగా ప్రమాణం చేసినప్పటినుంచి కేసీఆర్ అనేకసార్లు కేంద్రానికి లేఖలు రాశారు. సీఎం కేసీఆర్, మంత్రులు ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా ప్రధాని, సంబంధిత మంతులకు వినతిపత్రాలు ఇచ్చారు. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్ వేదికగా కొట్లాడారు. తెలంగాణకు వర్సిటీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఓ వైపు బీఆర్ఎస్ ఒత్తిడి తేవడం, మరోవైపు ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసం ప్రధాని మోదీ గిరిజన యూనివర్సిటీని ప్రకటించారు. హక్కుగా ఇవ్వాల్సిన వర్సిటీ ప్రకటనకే దశాబ్ద కాలం పడితే.. దాన్ని అమలు చేసి, విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడానికి మళ్లీ ఎన్ని దశాబ్దాలు పడుతుందోనని ప్రజలు చర్చించుకొంటున్నారు.

కేసీఆర్ ఇవ్వాలనుకొంటే.. మోదీ అలా చేశారు

2015లో పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి శంకుస్థాపనకు ప్రధాని మోదీ వెళ్లారు. రెండు కుండల్లో మట్టి, నీళ్లు తీసుకుపోయి అప్పటి సీఎం చంద్రబాబు చేతిలో పెట్టివచ్చారు. ఇదే విషయాన్ని ఓ సందర్భంలో సీఎం కేసీఆర్ కూడా గుర్తుచేసుకొన్నారు. 'వాస్తవానికి అమరావతికి మేము వెళ్లకముందు అక్కడ ఏదైనా సాయం ప్రకటించాలని అనుకొన్నాం. కానీ, ప్రధానమంత్రే మట్టి, నీళ్లు ఇచ్చినప్పుడు నేను ఏదైనా ప్రకటిస్తే.. బిడ్డా నాకంటే గొప్పోనివి అయిపోయినవా? అనుకుంటారని ప్రకటించలేదు. ఈ విషయాన్ని యాదమలతో, చంద్రబాబుతో కూడా చెప్పా' అని కేసీఆర్ పేర్కొన్నారు. అలా కేసీఆర్ అమరావతికి ఏదైనా చేయాలని అనుకొన్నప్పటికీ, ప్రధాని పరోక్షంగా అడ్డుకొన్నారు.

పసుపుబోర్డుపై కపట హామీ

దేశంలోనే అత్యధికంగా పసుపు పండిస్తున్న నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలనేది రైతుల దశాబ్దాల కల. గత ప్రభుత్వాలు రైతులను ఓటుబ్యాంకుగా మాత్రమే వాడుకున్నాయి. కానీ స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పసుపు బోర్డు కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీనికి ఎంపీ కవిత నేతృత్వం వహించారు. ఆమె ఆధ్వర్యంలో ఎంపీల బృందం అనేకసార్లు ప్రధాని మోదీని, మంత్రులను, అధికారులను కలిసి పసుపుబోర్డు ఇవ్వాలని వినతిపత్రాలు ఇచ్చారు. పసుపు రైతులకు మద్దతుగా ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో లేఖలు రాయించారు. కానీ ప్రధాని మోదీ మనసు కరగలేదు. చివరికి 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో పసుపుబోర్డును చేర్చుతామని చెప్పి బీజేపీ మోసం చేసింది. ధర్మపురి అర్వింద్ అంతకన్నా పెద్ద మోసం చేశారు. తనను గెలిపిస్తే వెంటనే బోర్డు తెస్తానని బాండ్ రాసిచ్చి, గెలిచాక విస్మరించారు. ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తుండటంతో నిజామాబాద్‌లో 'స్పైసెస్ బోర్డు' రీజినల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటన చేయించారు. కానీ తెలంగాణ ప్రభుత్వం, నిజామాబాద్ రైతులు బోర్డు మాత్రమే కావాలని పట్టుబట్టారు. ఈ ఒత్తిడికి కేంద్రం దిగివచ్చింది. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉత్తర్వులు జారీ చేసి, బోర్డు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాలని నిజామాబాద్ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

'నా కుటుంబం'లో పాలమూరు లేదా?

ప్రధాని మోదీ తన ప్రసంగంలో తరుచూ 'నా కుటుంబ సభ్యుల్లారా' అంటూ మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో సభ పెట్టి ఆ జిల్లాకు ఏమీ ప్రకటించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు'కు జాతీయ హోదా కల్పించక పోవడం ఏమిటని మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కృషితో పనులు దాదాపు పూర్తయ్యి వెటరన్ జరిగి నేపథ్యంలో జాతీయ హోదా ప్రకటిస్తే ఏంపోతుందని నిలదీస్తున్నారు. కరువు జిల్లాగా పేరుబడిన పాలమూరు పచ్చబడటం ఇష్టం లేదా? మీ కుటుంబ సభ్యుల్లో పాలమూరు బిడ్డలు లేరా? అని అడుగుతున్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయలేదంటూ ప్రధాని మోదీ అబద్ధాలు ఆడారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రెండు సార్లు రుణమాఫీ అమలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మోదీకి తెలుసు. అబద్ధాలు ఆడటం ఆయనకే చెల్లింది.
- రాష్ట్రంలో బీజేపీపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని మోదీ చెప్పుకున్నారు. ఇదే నిజమైతే బీజేపీ నుంచి నేతలు ఎందుకు వలసలు వెళ్లిపోతున్నారని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.
- కిసాన్ సమ్మాన్ యోజన కింద తెలంగాణకు ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు ఇచ్చామని మోదీ చెప్పుకొచ్చారు. కానీ, ఈ పథకం కింద కొత్త రైతుల నమోదును ఎందుకు నిలిపివేశారో చెప్పలేదు.
- బీజేపీ సభ అనగానే.. కుటుంబ పాలన, అవినీతి ప్రభుత్వం, ఎంఐఎం చేతిలో కారు స్టీరింగ్ వంటివి తప్ప కొత్త అంశాలు ఉండవని రాష్ట్రంలో అందరికీ తెలుసు. ఆదివారం ప్రధాని సైతం అవే రొడ్డకొట్టుడు వ్యాఖ్యలకే పరిమితం అయ్యారు.
- తాము పారదర్శక పాలన అందిస్తామని మోదీ చేసిన వ్యాఖ్యలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. కర్ణాటకలో 40% కమీషన్ ప్రభుత్వం ఎందుకు ఓడిపోయిందో గుర్తు చేసుకోవాలని మోదీకి సూచిస్తున్నారు. ఇక కేంద్రంలో షాడో ప్రధానిగా అదానీ వ్యవహరిస్తున్నారని ఎందుకు విమర్శలు వస్తున్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణకు మోదీ చేసిందేమిటి?

- తొమ్మిదేండ్లు అన్యాయం చేసి ఇప్పుడు చిలుక పలుకులా?
- గిరిజన యూనివర్సిటీపై తొమ్మిదేండ్లుగా జాప్యం
- 'పాలమూరు ప్రాజెక్టు'ను పూర్తి చేస్తామన్న హామీ ఏమైంది?
- జాతీయ హోదా ఇవ్వలేదెందుకు?
- కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే తెలంగాణ రాష్ట్రంలో చీకట్లే
- హస్తం పార్టీకి అధికారమిస్తే ఈ రాష్ట్రాన్నే అమ్మేస్తారు
- మళ్లీ సీఎం అయ్యేది కేసీఆరే
- కల్వకుర్తి, మహేశ్వరం సభల్లో మంత్రి హరీశ్‌రావు

కల్వకుర్తిలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్. చిత్రంలో ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల

నాగర్‌కర్నూల్/రంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ తొమ్మిదేండ్లుగా తెలంగాణకు అన్యాయం చేస్తూ, విభజన చట్టం ప్రకారం రావాల్సిన హక్కులను కాలరాస్తూ ఇప్పుడు చిలుక పలుకులు పలుకుతున్నారని మంత్రి హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. తమను గెలిపిస్తే పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన మోదీ.. ఈ ఐదేండ్లు ఏమి చేశారని ప్రశ్నించారు. విభజన చట్టంలో ఉన్న గిరిజన వర్సిటీనీ మంజూరు చేయకుండా తొమ్మిదేండ్లు జాప్యం చేశారని మండిపడ్డారు. ఆదివారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో రూ.17.5 కోట్లతో వంద పడకల దవాఖాన నిర్మాణానికి భూమిపూజ, రూ.45 కోట్లతో మిషన్ భగీరథ, రూ.10 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సెగ్రిగేషన్ షెడ్‌ను ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మీర్‌ఖాన్‌పేటలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేశారు. ఆయా సభల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీ నాలుగు చిలుక పలుకులు పలికారని ఎద్దేవా చేశారు. విభజన చట్టం ప్రకారం గిరిజన యూనివర్సిటీని ఇవ్వకుండా తొమ్మిదేండ్లుగా జాప్యం చేశారని, ఇప్పుడు చెవిలో పూలు పెడుతున్నారని విమర్శించారు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ, వరంగల్‌లో కోచ్‌ఫ్యాక్టరీ ఎప్పుడు పెడుతరో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఇంకా మోసం చేయాలని చూస్తున్నదని, ఆ పార్టీకి ఓటేస్తే అది ఖరాబైపోతుందని పేర్కొన్నారు.

> *'వైట్‌కాలర్ నేరగాళ్లని దేశం దాటించిన బీజేపీకి ఓటెయ్యాల్నా? లేక మీ పిల్లలు డాక్టర్లు కావాలన్న కలలను నిజం చేస్తూ వైట్‌కోట్ రివల్యూషన్ సృష్టించిన బీఆర్ఎస్ ప్రభుత్వం గెలవాల్నా? ఆలోచించాలి'*
>
> - మంత్రి హరీశ్‌రావు

నేరగాళ్లను దేశం దాటించిన మోదీ

కృష్ణా జలాల పంపకాలపై ట్రిబ్యునల్ వేయకుండా తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీళ్లను బీజేపీ ప్రభుత్వం అడ్డుకున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నల్లధనం బయటకు తెస్తామని, ఒక్కో అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని మాయమాటలు చెప్పిన మోదీ చివరకు నీరవ్‌మోదీ, విజయ్‌మాల్యా లాంటి వైట్ కాలర్ నేరగాళ్లను సేఫ్‌గా దేశం దాటించారని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలను మంజూరుచేస్తే, అందులో ఒక్కటి కూడా తెలంగాణకు ఇవ్వలేదని మండిపడ్డారు.

కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు

కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే రాష్ట్రం చీకటి మయం అవుతుందని, రైతులకు కరెంటు కష్టాలు, ఎరువుల కోసం తిప్పలు తప్పవని మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. రైతు బంధు, రైతుబీమా, గోదాముల నిర్మాణం, ధాన్యం కొనుగోళ్లు లాంటివి అమలవుతాయా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో విడతలవారీగా కరెంటు ఇచ్చేవారని, మోటర్లు కాలిపోయేవని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ హయాంలో ఒక్క మోటారు, ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ అయినా కాలుతున్నదా? రైతులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో ఉదయం పూట 3 గంటలే కరెంటు ఇస్తున్నారని తెలిపారు. 3 గంటల కరెంట్ కావాలా? మూడు పంటలు పండించే ప్రభుత్వం కావాలా? ఆలోచించాలని కోరారు. నీళ్లు, కరెంటు, ఆసరా పింఛన్లు ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవుల కోసం కొట్టుకుంటున్నారని, ఎకరం భూమికి, రూ.పది కోట్లకు టిక్కెట్లు అమ్ముకుంటున్నారని ఎద్దేవాచేశారు. వారిని ఎన్నుకుంటే టిక్కెట్లతోపాటు తెలంగాణనూ అమ్ముకుంటారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు క్లారిటీతో ఉన్నారని, కాంగ్రెస్ ఎన్ని తీర్మానాలు చేసినా ముఖ్యమంత్రిగా కేసీఆర్‌నే కోరుకుంటున్నారని చెప్పారు. విప్ గువ్వల బాలరాజు, ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి పాల్గొన్నారు.

'పాలమూరు ప్రాజెక్ట్' ఊసేది ?: మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ పాలమూరు సభలో పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు ఊసేలేదని మంత్రి నిరంజన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో మోదీ ఇచ్చిన ఎన్నికల ప్రచారం హామీ మోసపూరిత మేనా? అని ప్రశ్నించారు. పీఆర్ఎల్ఐఎస్‌కు జాతీయ హోదా ప్రకటించకపోవడం పాలమూరు ప్రజలను వంచించడమేనని అన్నారు. కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా గురించి ప్రధాని ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. పాలమూరుకు వచ్చి పసుపుబోర్డు, గిరిజన విశ్వవిద్యాలయం ప్రకటించడం బీజేపీ అవగాహనారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. వీటివల్ల పాలమూరు జిల్లాకు కలిగే ప్రయోజనాలు ఏంటి? అని ప్రశ్నించారు. పాలమూరు ప్రజలకు బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇప్పుడా గిరిజన వర్సిటీ ఇచ్చేది: మంత్రి ఎర్రబెల్లి

పదేండ్ల క్రితం ప్రకటించిన గిరిజన యూనివర్సిటీనీ ఇన్నేండ్లకు ఇస్తారా? అని ప్రధాని మోదీపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మహబూబ్‌నగర్ సభలో కొత్తగా ప్రధాని ఇచ్చిన హామీ ఏమిటి? అని ప్రశ్నించారు. ఎప్పుడో ఇచ్చిన హామీలను ఇప్పుడు ప్రకటించి.. వాటినే తమ ఘనతగా చెప్పుకోవడం దేనికి సంకేతమని నిలదీశారు. తెలంగాణకు ఎప్పుడో ఇవ్వాల్సిన పసుపుబోర్డును ఇవ్వాళ ఇస్తారా? అని ప్రశ్నించారు. మోదీ ఎన్నికల కోసం చేసే జిమ్మిక్కులను నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరని ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు.

గిరిజనుల ఓట్ల కోసం కేంద్రం కుట్రలు: మంత్రి సత్యవతి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): గిరిజన ఓట్ల కోసం కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉండటంతో ఇప్పుడు గిరిజనులపై కపట ప్రేమ నటిస్తున్నదని విమర్శించారు. యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ 2014 నుంచి అనేక పర్యాయాలు ప్రధాని మోదీని కలిసి డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ వర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లా జాకారంలో 335.04 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. అయినా ఫలితం లేకపోడంతో కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్ లోపల, వెలుపల ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు గిరిజనుల ఓట్ల కోసమే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించిందని విమర్శించారు. ఈ పదేండ్లలో వర్సిటీ ఏర్పాటు చేయకపోవడంతో గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గిరిజన వర్సిటీ ఏర్పాటు పై కేంద్రం వివక్ష చూపినా.. సీఎం కేసీఆర్ గిరిజన వర్సిటీ కోసం 2019 జనవరి 11న ఎస్‌టీఎస్‌డీఎఫ్ (షెడ్యూల్డ్ ట్రైబ్స్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) నుంచి రూ.15 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారని తెలిపారు. డీపీఆర్ రూపొందించేందుకు 2019-20 బడ్జెట్‌లో రూ.4 కోట్లు కేటాయించినట్టు గుర్తు చేశారు. ములుగు జిల్లా జాకారంలోని గిరిజన సంక్షేమ శాఖ యువ శిక్షణా కేంద్రం (వైటీసీ)ను తాత్కాలిక ప్రాంగణంగా స్వీకరించాలని కేంద్ర విద్యాశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నివేదించిందని గుర్తుచేశారు. ఎన్నికల వేళ బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టడం ఖాయమని అన్నారు.

తెలంగాణపై మోదీ సవతి ప్రేమ

- పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలి
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణప్రతినిధి): ప్రధాని మోదీ తెలంగాణపై సవతి తల్లి ప్రేమను చూపుతున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఎన్ని పర్యటనలు చేసినా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని అన్నారు. మహబూబ్‌నగర్ పర్యటకు వచ్చినా పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా ప్రకటించలేదని మండిపడ్డారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా మోదీ ఎన్ని పర్యటనలు చేసినా తెలంగాణ ప్రజలు నమ్మరని చెప్పారు. ఆదివారం ఆయన నల్లగొండలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఎందుకు మంజూరు చేయలేదని? నీతి ఆయోగ్ చెప్పినట్టుగా మిషన్ భగీరథకు, కేంద్ర సంస్థలు సూచించిన మిషన్ కాకతీయకు నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీ అవకాశం దొరికినప్పుడల్లా అక్కసు వెళ్లగక్కేందుకే యత్నిస్తున్నారని అన్నారు.

వట్టిమాటలు కట్టిపెట్టు మోదీ: దాసోజు శ్రవణ్

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ ప్రసంగం చూస్తే 'వట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టి మేలు తలపెట్టవోయ్' అనే గురజాడ అప్పారావు మాటలు గుర్తొస్తున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ చమత్కరించారు. మోదీ మాయ మాటలు చెప్పి తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను ఎందుకు అమలుపరచడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరుకు జాతీయ హోదా, బయ్యారం ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎందుకు ఇవ్వరు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అడిగారు.

మోదీ సభకు ఎంపీ సోయం డుమ్మా!

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ సభకు పలువురు నేతలు గైర్హాజరు కావడంపై బీజేపీలో చర్చ జరుగుతున్నది. ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎంపీలు విజయశాంతి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరు కాలేదు. రాష్ట్రంలోని ముఖ్య నాయకులందరూ హాజరైన ఈ సభకు వీరు మాత్రమే ఎందుకు రాలేదన్నది రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

బీజేపీది ఎన్నికల స్టంట్: సీతారాంనాయక్

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గిరిజన వర్సిటీ ఏర్పాటు నిర్ణయం అనేది ప్రధాని మోదీ ఎన్నికల స్టంట్‌లో భాగమని మాజీ ఎంపీ సీతారాంనాయక్ విమర్శించారు. ఎన్నికల ముందు వర్సిటీ గుర్తుకొచ్చిందని ఎద్దేవా చేశారు. వర్సిటీని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖలో తీసుకోవాలని సూచించారు.

పాలమూరులో లబ్ధిదారులకు లక్ష సాయం చెక్కును అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రధాని వచ్చిపోవుడే.. చేసేదేమీ లేదు

- మోదీకి తెలంగాణ అంటేనే ద్వేషం
- క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్/మహబూబ్‌నగర్, అక్టోబర్ 1: 'ప్రధాని నరేంద్ర మోదీ మహబూబ్‌నగర్‌కు వస్తాడు.. పోతాడు.. కానీ ఈ ప్రాంతానికి చేసేది మాత్రం ఏమీ ఉండదు.. ఆయనకు ఈ ప్రాంతమంటేనే ద్వేషం' అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా హామీ ఇచ్చి ఇప్పటికే మూడుసార్లు మోసం చేశారని, మళ్లీ ఈ ప్రాంత ప్రజలను వంచించేందుకు మరోసారి పర్యటించారని ధ్వజమెత్తారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో 11 మందికి బీసీ చేయూత, 23 మంది లబ్ధిదారులకు మైనార్టీ బంధు చెక్కులను పంపిణీ చేశారు. 200 మంది నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. జిల్ల